జూలో సందడి



వన్యప్రాణుల వేషధారణలో చిన్నారులు



ఎన్‌క్లోజర్ బయట తిరుగుతున్న కనుజు

ఆరిలోవ: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కు సందడిగా మారింది. ఈ నెల 2న ఈ వారోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. పిల్లలు, పెద్దలకు వన్యప్రాణులకు సంబంధించిన అంశాలపై పోటీలు జరిపారు. ఇందులో భాగంగా శనివారం పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. దీంతో చిన్నారులను వివిధ వన్యప్రాణుల వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం జూలో మారథాన్ నిర్వహించనున్నామన్నారు.



జూలో ఓ బాలుడు



వేషధారణలో అలంకరించిన పిల్లలతో తల్లిదండ్రులు



సీఎం జగన్‌తోనే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

తాటిచెట్లపాలెం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 41, 42 వార్డుల పరిధి రైల్వే న్యూకాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజల కోసం శనివారం సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, అనారోగ్యం వస్తే వలంటీర్ల సహాయంతో వైద్య నిపుణుల ద్వారా సమస్య పరిష్కరించేలా ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. రైల్వే న్యూకాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని ఐదు సచివాలయాల్లో ఉన్న వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఇంటింటికీ వెళ్లి ప్రతీ ఒక్కరికీ వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వాసుపల్లి కోరారు. అనంతరం వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన మలేరియా అవగాహన శిబిరం, మాతా శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో పోషకాహార విలువలను తెలియజేసే ఐసీడీఎస్ స్టాళ్లను ఆయన సందర్శించి అభినందించారు. వైద్య శిబిరంలో సుమారు 800 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో 41వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ కోడిగుడ్ల పూర్ణిమ, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ జైన్, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి, జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, పార్టీ నాయకులు ఎస్.ప్రసాదరావు, రమణారెడ్డి, వడ్డాది దిలీప్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శంకరమఠం రోడ్డులో గంధ్రేటి రవిబాబు ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

మర్యాదపూర్వక కలయిక



ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్‌ను చాంబర్‌లో శనివారం 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



కణితి నవనీత్

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జయప్రకాష్ నగర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న కణితి నవనీత్(14) అనే బాలుడు పెదకొత్తూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 6న స్కూల్‌కు వెళ్లి సాయంత్రమైనా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా గాలించారు. ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు నవనీత్ తండ్రి కనకరాజు చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజధానికి ఆటంకాలు లేకుండా చూడాలి



అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 108 అడుగుల గణేష్ మండపం వద్ద శనివారం జరిగిన భారీ అన్నసంతర్పణ జరిగింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి దంపతులు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని గణనాథుడిని వేడుకున్నట్లు తెలిపి నిర్వాహకులను అభినందించారు.

త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్ ఏర్పాటు

- వీపీఏ చైర్మన్ అంగముత్తు
- ఘనంగా విశాఖ పోర్ట్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ) 90వ ఆవిర్భావ దిన వేడుకలు శనివారం పోర్ట్ వ్యాపార భాగస్వాములు, ఉద్యోగుల మధ్య పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ పోర్ట్ అభివృద్ధికి పలు సూచనలిచ్చారు. త్వరలోనే పోర్ట్ వ్యాపార భాగస్వాముల సలహాలతో మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని సందర్శనకు నగర పౌరులకు కూడా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ కాంప్లెక్స్‌లో 90 ఏళ్ల కాలంలో పోర్ట్‌లో వినియోగించిన వస్తువులు, పురాతన వస్తువులతోపాటు 90 వసంతాల పోర్ట్ ప్రయాణాన్ని వివరించే ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కాంప్లెక్స్‌ను బీచ్‌కు అభిముఖంగా నూతనంగా నిర్మించిన కంటైనర్ టెర్మినల్‌ను కలిపే విధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. పోర్ట్ కార్యకలాపాలను సాధారణ ప్రజలు కూడా తెలుసుకునేలా రాస్‌హిల్స్‌పైన ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

అంతరిక్ష వారోత్సవాల సందడి



ఇస్రో ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష వేడుకలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. మూడో రోజైన శనివారం ఇస్రో శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలో 1,450, వ్యాసరచనలో 985, పోస్టర్ ప్రజెంటేషన్‌లో 310, చిత్రలేఖనంలో 1,860 మంది కలిపి మొత్తం 4,605 మంది పాల్గొన్నారు. రాకెట్ ప్రయోగాలు, అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి శాస్త్రవేత్తలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, షార్ ఆర్గనైజింగ్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న పర్యవేక్షించారు

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'



బ్రోచర్ అందజేస్తున్న కె.కె.రాజు, వెంకటరమణ

మద్దిపాలెం: ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 51వ వార్డులోని 289 సచివాలయం పరిధి కళింగనగర్ ఆయా ప్రాంతాల్లో శనివారం గడప గడపకు కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ, సమస్యలు తెలుసుకుని పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ లక్ష్యంగానే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వానికి పూర్తి భిన్నంగా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేరుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్‌లు పైడి కృష్ణారావు మాస్టరు, అమర్‌రెడ్డి, వసంతల అప్పారావు, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, 51వ వార్డు సీనియర్ నాయకులు బి.తిరుమలరావు, దమయంతి, పొన్నాడ అప్పారావు మాస్టరు, శ్యామ్, వరలక్ష్మి, రత్నం, గణేష్, సాధు, వినోద్, రాణి, చిన్ని, భాను, బాబూరావు, సీనియర్ నాయకులు భోగవిల్లి గోవింద్, షేక్ బాబ్జి, హరిపట్నాయక్, ఎం.సునీల్, సంతోష్, రమేష్, శ్రావణ్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శం



బంగారు నంది గ్రహీత బగాది విజయసారథిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని పౌరాణిక రంగస్థల కళాకారుడు, బంగారు నంది పురస్కార గ్రహీత బగాది విజయసారథి అన్నారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగిస్తూ పద్య నాటకానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లుగా అభివర్ణించారు. పద్యనాటకం ప్రాధాన్యాన్ని ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పౌరాణికాన్ని ఆదరించడానికి సంస్థలు ముందుకు రావాలని కోరారు. తెలుగు భాష గొప్పదనం, కమ్మదనం తెలుగు నేల బిడ్డలు తెలుసుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులను బగాది అభినందించారు. పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ పచ్చదనం పరిరక్షణకు వాకర్స్ పార్కులో నిర్వహిస్తున్న ప్రాజెక్టుల వివరాలు తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ ఆర్.సత్యనాథం నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. వాకర్స్ జిల్లా–101కు ఎలెక్ట్ గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కె.ద్వారకానాథ్‌ను క్లబ్ సభ్యులు అభినందించారు. ముఖ్య అతిథి విజయ సారథితోపాటు విరాళాల దాతలను సత్కరించారు.

ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న సభ్యులకు చిరుకానుకలు అందించారు. వాకర్స్ క్లబ్ మాసపత్రిక సంచికను పూర్వాధ్యక్షుడు చిలకపాటి కృష్ణమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, సత్తి సునీల్‌రెడ్డి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, వడ్డాది అప్పారావు, బి.సూర్యనారాయణ, కూర్మారావు, సత్తి లలితారెడ్డి, కె.మాధవి, జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలందరి ఆరోగ్యానికి రక్ష



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు



ఆరోగ్య సురక్ష సర్వేలో పాల్గొన్న 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. వార్డులోని 131, 133, 134 సచివాలయాల పరిధిలో క్లబ్ రోడ్, కనకమ్మవారి వీధి, రాజేంద్రనగర్, నాయుడు వీధి, మధురానగర్ ప్రాంతాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఆయన పాల్గొన్నారు. వైద్య సేవలు, రక్తపరీక్షల వివరాలను ప్రజలకు తెలియజేసి సంబంధిత కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో సారిపిల్లి గంగరాజు, వియ్యపు సంతోష్, బోనుల జయ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు ఉచిత వైద్యం

మురళీనగర్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం ప్రజల చెంతకు ఉచిత వైద్యం అందిస్తోందని 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు అన్నారు. వార్డులోని పట్టాభిరెడ్డి తోటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి కుటుంబంలోని సభ్యులందరికీ ఆరోగ్య పరీక్షలు చేసి టోకెన్లు అందజేస్తారన్నారు. వైద్య శిబిరం నిర్వహించే సమయంలో టోకెన్లతో రావాలని ప్రజలకు సూచించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ తరహాలో షెల్టర్లు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతంపేట: విశాఖపట్నంలో నిరాశ్రయులకు జీవీఎంసీ నిర్వహిస్తున్న తరహాలో రాష్ట్రంలోని 32 పట్టణాల్లో ఉన్న 89 షెల్టర్ల నిర్వహణ బాధ్యత ప్రభుత్వం చేపట్టాలని అసోసియేషన్ ఫర్ అర్బన్ అండ్ ట్రైబల్ డెవలప్‌మెంట్(ఏయూటీడీ) కార్యదర్శి ప్రగడ వాసు కోరారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లు, 50 వేల జనాభా ఉన్న మున్సిపాలిటీల్లో మెప్మా, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కలిసి రాష్ట్రంలో 89 షెల్టర్లు మంజూరు చేసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఆయా షెల్టర్ల నిర్వహణకు నిధులు మంజూరు చేసిందని, 32 షెల్టర్లకు గడువు పూర్తి కావడంతో నిధులు నిలిపివేశారన్నారు. గడువు పూర్తయిన షెల్టర్లకు మరో రెండేళ్ల కాలపరిమితి పొడిగిస్తూ, మున్సిపాలిటీలను సొంత నిధులతో నడపాలని మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో తప్ప రాష్ట్రంలో మరెక్కడా మంత్రి ఆదేశాలు అమలు కాలేదని, ఫలితంగా షెల్టర్లు మూతపడే స్థితికి వచ్చాయని తెలిపారు. నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుని షెల్టర్లలో సౌకర్యాలు మెరుగుపర్చాలని వాసు కోరారు. సమావేశంలో కర్నూల్, అనంతపూర్, కడప, హిందుపూర్ ప్రాంతాలకు నుంచి వచ్చిన దామోదర్ రెడ్డి, పార్థసారథి, నాగిరెడ్డి, యాగప్ప పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

సీతమ్మధార: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట గణేష్‌నగర్‌కు చెందిన అశోక్(33) అనే వ్యక్తి మట్టి బొమ్మలు తయారు చేసి విక్రయిస్తుంటాడు. కొద్ది రోజుల కిందట అతడి సోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మనస్తాపం చెందిన అశోక్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా మద్యపానం మానకపోవడంతో ఇంట్లో చిన్నపాటి గొడవలు జరిగేవి. మనస్తాపానికి గురైన అశోక్ ఈ నెల 5న సత్యం జంక్షన్ సమీపంలోని ఒక షాపులో చెద పురుగుల మందు కొని ఇంటి తీసుకెళ్లి తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అశోక్ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రి నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నేర నియంత్రణకు సహకరించండి



మాట్లాడుతున్న క్రైం ఎస్‌ఐ సునీల్

మద్దిపాలెం: నేరాలు నియంత్రించేందుకు ప్రజలు సహకరించాలని కంచరపాలెం ఐదో పట్టణ క్రైం ఎస్‌ఐ సునీల్ కోరారు. కంచరపాలెం పరిధి చాకలిగెడ్డ వద్ద దయానంద్‌నగర్‌లో శనివారం రాత్రి నేర నియంత్రణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ వాసులతోపాటు స్థానికులు సంఘాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటి దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల చోరీలు జరుగుతున్నాయని, ప్రజల దృష్టిని మళ్లించి ఇటువంటి చోరీలకు పాల్పడుతున్నారని, అన్ని వేళలా జాగ్రత్త వహించాలని చెప్పారు. అందరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. తద్వారా నేరాలకు పాల్పడే వారిని త్వరితగతిన గుర్తించి నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ సిబ్బంది తెలియజేసిన వివరాల ప్రకారం.. గత నెల 28న సమతా ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖకు చేరుకున్న తరువాత ఆర్పీఎఫ్ సిబ్బంది రైలును తనిఖీ చేస్తున్న సమయంలో ఎస్–3కోచ్‌లో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించారు. వెంటనే ఆర్పీఎఫ్ సిబ్బంది 108 అంబులెన్స్ సహాయంతో కేజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. మరణించిన వ్యక్తి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. వయసు సుమారు 28–32 ఏళ్ల మధ్య ఉండవచ్చు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ లేదా 96612 2722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని కేసు దర్యాప్తు చేస్తున్న జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు కోరారు.

ఘనంగా ఘంటసాల శతాబ్ది వేడుకలు



బాల కొండలరావును సత్కరిస్తున్న సంస్థ వ్యవస్థాపకులు, చిత్రంలో పురందేశ్వరి, శివమణి

మద్దిలపాలెం: ఘంటసాల శతాబ్ది వేడుకలు మద్దిలపాలెం కళాభారతిలో శనివారం ఘనంగా జరిగాయి. చెన్నైకు చెందిన కళా ప్రదర్శిని సంస్థ వ్యవస్థాపకులు ఘంటసాల కోడళ్లు పార్వతీరవి, కృష్ణకుమారి రత్నల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఘంటసాల ఆలపించిన మధురగేయాలకు పార్వతీ రవి ఘంటాల నృత్య నిర్దేశకత్వంలో అలరించాయి. ఘంటసాల స్మారక పురస్కారాలను నాట్య గురువులు ఏబీ బాలకొండలరావుకు, వేదాంతం రామలింగ శాస్త్రిలకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ సంగీత సరస్వతి ముద్దు బిడ్డగా ఘంటసాల వేంకటేశ్వరరావు ఖ్యాతికెక్కారన్నారు. డ్రమ్స్ శివమణి తన డ్రమ్స్ విన్యాసంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్.జి.రఘురామారావు, డాక్టర్.సయ్యద్ రెహ్మతుల్లా, జాన్ మాస్టార్, ఘంటసాల స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సింగరాయిమెట్టలో తల్లితో కలిసి టి.శ్రీనివాస్(14) అనే బాలుడు నివసిస్తున్నాడు. మురళీనగర్‌లోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి లేకపోవడంతో తల్లి ఇంటి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం స్కూల్ వదిలాక, తల్లి వద్దకు వెళ్లి ఇంటి తాళాలు తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా.. కుమారుడు గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బాలుడి ఆత్మహత్యకు గల కారణాలపై సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతమ్మధార: జోన్–1 డివిజన్‌లోని 11 కేవీ కేఆర్‌ఎం కాలనీ ఫీడర్, 33/11 కేవీ ఎంఎంటీసీ కాలనీ ప్రాంతంలో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కేఆర్‌ఎం కాలనీ, భారత్‌మాత విగ్రహం, ఐసీఐసీఐ బ్యాంకు, రామాలయం, బాలయేసు చర్చి, వెంకటేశ్వర ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.